సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 22-1-2025
సంపుటి: 20 సంచిక: 254
పేజీలు: 4 వెల: రూ.1

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



(సత్యంన్యూస్, పలాస)
నిత్య జీవితంలో ఎంతోమందికి సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి పరిస్థితి ఏర్పడకుండా యువత రక్తదానం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం విశాఖపట్నం ఎన్టీర్ ట్రస్ట్, శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి, టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి, కాశీబుగ్గ ప్రాణదాత, శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ - మిగతా 4లో



మీరు న్యూకాలనీవాసులా?.. పొరపాటున లోన్ మీద కారు కొనుక్కున్నారా? దాన్ని అపార్ట్‌మెంట్ నుంచి బయటకు తీయాలంటే లారీ బ్రోకరాఫీసులను సంప్రదించండి. అదేంటీ? మా అపార్ట్‌మెంట్ నుంచి మా కారు బయటకు తీయాలంటే లారీ బ్రోకరాఫీసుకు ఎందుకు అడగాలనే ప్రశ్న తలెత్తితే.. ఒక్కసారి న్యూకాలనీ వెళ్లి అక్కడ నివసిస్తున్నవారిని అడిగిచూడండి.

> కాలనీ మొత్తం ట్రాన్స్‌పోర్ట్‌మయం
> గంజాయి రవాణాకు కేరాఫ్ అడ్రస్
> రెచ్చిపోతున్న రౌడీమూకలు
> న్యూకాలనీ-క్రైమ్ కహానీ 2



# మీరు బయటకు రావాలా!
# బ్రోకరాఫీసును సంప్రదించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
న్యూకాలనీలో ఒకప్పుడు నిండా జనాలు, రాజకీయ నాయకుల పరిభాషలో చెప్పాలంటే ఓటర్లు ఉండేవారు. కానీ ఇక్కడ ఇండివిద్యువల్ భవనాలన్నీ గొడౌన్లుగానో, లేదంటే లారీ బ్రోకర్ ఆఫీసులుగానో మారిపోయాయి. న్యూకాలనీలోకి ప్రవేశించడానికి ఉన్న అన్ని మార్గాల్లోనూ కనీసం రెండుకు తక్కువ లేకుండా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం కావడంతో నిత్యం భారీ వాహనాలు ఇక్కడకు వస్తున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ అనగానే ఎత్తైన కంటైనర్ లాంటి లారీలు న్యూకాలనీలోకి ప్రవేశించి రోడ్డు మీదే నిల్చుంటున్నాయి. అక్కడే లోడింగ్, అన్‌లోడింగ్ జరుపుతున్నాయి. దీనివల్ల ఎవరు ఆ మార్గం గుండా ప్రయాణించాలన్నా ముందుగా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలకు వెళ్లి బాబ్బాబు మా కారొచ్చింది కొంచెం లారీలను పక్కన పెట్టిస్తారా అని బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. గతంలో ధర్మాన ప్రసాదరావు మంత్రిగా ఉన్నప్పుడు న్యూకాలనీలో నివాసమున్న ఇంటిదగ్గర నుంచి ఆ చుట్టుపక్కలన్నీ ఇప్పుడు గొడౌన్లే. సరిగ్గా డైమండ్‌పార్క్ మొదటి రోడ్డు జంక్షన్ వద్ద జేవై స్కూల్, దానికి ఆనుకొనే రెండు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉన్నాయి. సాయంత్రం పిల్లలను విడిచిపెట్టడం, ట్రాన్స్‌పోర్ట్ లారీల నుంచి సరుకును దిగుమతి చేయడం ఒకేసారి జరుగుతుంటాయి. ఈ రోడ్డులో వెళ్లాలంటే కనీసం అరగంట వేచివుండాలి. అలాగే బాకర్‌సాహెబ్‌పేట వైపు నుంచి వచ్చే మార్గంలో నవత, ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్టులు పెద్ద పెద్ద వాహనాలను నిలిపేస్తున్నాయి. ఇక్కడి నుంచి కూడా న్యూకాలనీలోకి ప్రవేశించలేం. ఇక ఎక్సైజ్ సర్కిల్ ఆఫీసు ఎదురు రోడ్డు నుంచి వస్తే అక్కడ కూడా ట్రాన్స్‌పోర్టు బ్రోకర్ ఆఫీసులు ఉన్నాయి. న్యూ కాలనీ మెయిన్‌రోడ్డులో మరో రెండు, బుర్రావారితోట రోడ్డు పక్క నుంచి న్యూకాలనీలోకి వెళ్లే మార్గంలో మరో రెండు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉన్నాయి. ఇవన్నీ పేరుమోసిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు కావడం, రోజుకు నాలుగు లారీలకు తక్కువ కాకుండా రావడం, అవి కూడా భారీవి కావడం న్యూకాలనీవాసులు చేసుకున్న పాపం. రోడ్డు మీదే లారీలు నిలిపి సరుకును దించడం వల్ల ఒకవైపు లారీలు, మరోవైపు సరుకుతో రోడ్డు నిండిపోతుంది. అడిగితే దండయాత్రకు వస్తున్నారంటూ - మిగతా 4లో






# కార్పొరేషన్ అంటే..
# మెయిన్‌రోడ్లేనా?

- కోట్లు విలువ చేసే స్థలాలు తీసుకొని అభివృద్ధి మరిచారు
- పాలకొండ రోడ్డులో చెట్లేస్తే నగరమంతా సుందరమైపోతుందా?
- పెరుగుతున్న ట్రాఫిక్‌కు పరిష్కారమేంటి?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
ఎప్పుడో 24 ఏళ్ల క్రితం ఓ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. దాని ప్రకారం అప్పుడున్న జనాభాకు, వాహనాలకు అనుగుణంగా రోడ్లు ఏయే రోడ్లు ఎంత వెడల్పులో ఉండాలో నిర్ధారించారు. సీన్ కట్‌చేస్తే.. ఆ మాస్టర్‌ప్లాన్‌కు సమయం ముగిసిపోవడంతో కొత్తగా వచ్చిన జనాభాకు, వాహనాలకు ఏమేరకు రోడ్లుండాలి? ప్రత్యామ్నాయం ఎలా ఉండాలి? అని నిర్దేశిస్తూ కొత్తగా తయారుచేసిన మాస్టర్‌ప్లాన్‌పై ఏకాభిప్రాయం కుదరక ఇప్పటికీ మల్లగుల్లాలు పడుతున్నారు. గడిచిన ఆరు నెలల్లో నాలుగుసార్లు దీని మీద సమావేశం పెట్టారు. ఎంతసేపూ జీటీ రోడ్డు, పాలకొండ రోడ్డు, కళింగరోడ్డు, కలెక్టర్ బంగ్లా రోడ్డు కోసం మాట్లాడుతారే తప్ప సందుగొందులుగా మిగిలిపోయిన అసలు సిసలు సిక్కోలు కోసం ఏ పాలకులూ ఆలోచించడంలేదు. ఇప్పుడు రథసప్తమి వస్తుందని ఉన్న రోడ్లపై మొక్కలు నాటో, కరెంటు స్తంభాలు వేసో డెకరేషన్ వైపు మొగ్గు చూపుతున్న పాలకులు వేరే ప్రాంతాల నుంచి వచ్చినవారి మెప్పును పొందవచ్చేమో గానీ సగటు సిక్కోలువాసికి మాత్రం దీనివల్ల ప్రయోజనం చేకూరదు. కేవలం నాలుగడుగుల వెడల్పు, ఆరడుగుల లోతు లోపు ఉన్న స్థలంలో బిల్డింగ్ ప్లాన్ ఇవ్వాలంటే 30 అడుగులు రోడ్డుకు విడిచిపెట్టాలనే నిబంధన పెట్టి అన్యాయంగా వీధుల్లో ఉన్నవారి నుంచి రోడ్డు కోసం 30 అడుగులు రిజిస్ట్రేషన్ చేయించుకొని లక్షలు విలువైన సైట్లు తీసుకున్న నగర కార్పొరేషన్ ఇప్పుడు ఆ వీధుల్లో రోడ్లు ఎందుకు వెడల్పు చేయడంలేదన్నదే ప్రధాన ప్రశ్న. సీసీ రోడ్డు స్థానంలో బీటీ రోడ్డు, కొత్తగా వేసిన బీటీ రోడ్డు మూడు నెలలకే పాడైతే మరో రోడ్డు వేస్తున్నారు తప్ప గడిచిన 70 ఏళ్లలో శ్రీకాకుళం నగరంలో ఏ వీధిలో రోడ్డయినా వెడల్పు చేశారా? కానీ రూల్ ప్రకారం 30 అడుగుల స్థలం తీసుకోవడం వెనుక ఆంతర్యమేమిటి? అభివృద్ధి అంతా ఒక్క జీటీ రోడ్డులోనో, పాలకొండ రోడ్డులోనో ఉండటం వల్లే చిక్కంతా వచ్చింది. పాలకొండ రోడ్డులో డివైడర్ పెట్టి, మధ్యలో మొక్కలు నాటి సుందరీకరణ అని చెబుతున్న పాలకులు, అధికారులు జీటీ రోడ్డులో కూడా డివైడర్ పెట్టి, మొక్కలు నాటి బహు సుందరీకరణ అని నామకరణం చేస్తే మరీ బాగుంటుంది. ఎందుకంటే పాలకొండ రోడ్డుకు వచ్చే ప్రయాణీకుల కంటే జీటీ రోడ్డులో జనాలెక్కువుంటారు. ఇది పూర్తిగా కార్పొరేట్ వ్యాపారులకు కేంద్రంగా ఉంది కాబట్టి వినియోగదారులు ఎక్కువ మంది వచ్చిపోతుంటారు. ఇక్కడ డివైడర్ పెట్టి అందమైన మొక్కలు, సెంటర్ లైటింగ్, మధ్యలో ఫౌంటెన్‌లు పెడితే అద్భుతంగా ఉంటుందనేవారు లేకపోలేదు. కానీ ఆ పని ఇక్కడి పాలకులు చేయరు. ఎందుకంటే.. ఇక్కడ అన్ని రాజకీయ పార్టీల నేతలకు ఆస్తులున్నాయి. ఒక్కడికి పార్కింగ్ ప్లేసుంటే ఒట్టు. ఒకటి రెండు కమర్షియల్ భవనాలకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుచేసినా, అందులోనే వారి స్టోర్ రూమ్‌లు, సెక్యూరిటీ రూమ్‌లు పెట్టుకొని కస్టమర్ల వాహనాలు మాత్రం సెంటర్ పార్కింగ్‌లో పెట్టిస్తున్నారు. అంతెందుకు.. స్వయంగా జీటీ రోడ్డులోని షాపుల్లో పని చేస్తున్న చిరుద్యోగుల వాహనాలు కూడా సెంటర్ పార్కింగ్‌లోనే ఉంటాయి. ఇక సంక్రాంతి సీజన్‌లో జీటీ రోడ్డులో ఎక్కడ పార్క్ చేసుకున్నా పోలీసులు అడగరు. కాబట్టి అసలు తమకు పార్కింగ్ సమస్యే కాదు కాబట్టి అద్దులు లక్షల్లో వసూలు చేస్తున్నారు. జీటీ రోడ్డులో ఒక సాధారణ సెల్ షాపునకు నెలవారీ అద్దె రూ.2 లక్షలంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేవలం - మిగతా 4లో

## శివారు ఆయకట్టుకు నీరందించే చర్యలు

**ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి**

**నారాయణపురం ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పంచిరెడ్డి కృష్ణారావు**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
సంతకవిటి మండలం, రంగరాయపురం వద్ద 1959-64లో నిర్మించిన నారాయణపురం ఆనకట్ట ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస, శ్రీకాకుళం, రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల పరిధిలోని రైతాంగానికి, ఆయకట్టు చెరువులకు దశాబ్దాలుగా సాగునీరు అందుతుంది. రెండు దశాబ్దాలుగా ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని ఎచ్చెర్ల మండలం పరిధిలోని టైలాండ్ - మిగతా 4లో

• ఎడిటోరియల్

# మొదటి దెబ్బ పడింది..!

అమెరికా 47వ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేయగానే డోనాల్డ్ ట్రంప్ అన్నట్లుగానే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా మొదటి దెబ్బ వేసాడు. అమెరికాలో పుట్టగానే పౌరసత్వం రాదు ఇకముందు. అమెరికన్ పౌరులకి పుట్టిన వాళ్లకి మాత్రమే ఆటోమేటిక్‌గా పౌరసత్వం వస్తుంది. పర్మినెంట్ రెసిడెంట్ లేదా గ్రీన్‌కార్డ్ ఉన్నవారి పిల్లలకి పౌరసత్వం ఆటోమేటిక్‌గా వస్తుంది. హెచ్1బి వీసా, స్టూడెంట్ వీసా, ఏదన్నా వర్క్ వీసా మీద అమెరికా వెళ్లిన వాళ్లకి అక్కడ పుట్టిన పిల్లలకి ఆటోమాటిక్‌గా పౌరసత్వం రాదు. ఇకనుంచి గ్రీన్‌కార్డ్ పొందడం చాలా కష్టం. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్స్ కూడా ఆమోదం పొందడం కష్టం. ఇకముందు హెచ్1బి వీసా దొరకడం కూడా కష్టం. ఇప్పటికే హెచ్1బి వీసా మీద అమెరికాలో ఉన్నవాళ్లకి రెన్యువల్ అవడం కూడా కష్టం. హెచ్1బి వీసా కాల పరిమితి 6 సంవత్సరాలు పూర్తయిన వారిని బలవంతంగా వారి వారి దేశాలకి పంపించేస్తారు. ఒక్క భారతీయులకే కాదు.. కానీ అన్నీ దేశాల వాళ్లకి ఇది కష్టకాలం. ఇప్పటి వరకూ హెచ్1బి వీసా మీద అమెరికా వెళ్లి పనిచేస్తూ పెళ్లి చేసుకొని భార్యని కూడా అమెరికా తీసుకెళ్లి అక్కడే పిల్లలని కనడం, తర్వాత పిల్లలకి అమెరికా పౌరసత్వం వచ్చేయడం ఈలోపున అంటే పదేళ్లకి గ్రీన్‌కార్డ్ రావడం జరుగుతూ వచ్చింది. కానీ ఇక నుంచి అలా కుదరదు. ట్రంప్ ఇచ్చింది ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ మాత్రమే. కానీ సుప్రీంకోర్టు సమర్థిస్తుందా? ఎందుకంటే రాజ్యాంగ సవరణ చేయాలి ట్రంప్ ఆర్డర్ కనుక పూర్తిస్థాయిలో అమలు కావాలి.. అంటే ఇది సుదీర్ఘమైన పోరాటం అవబోతున్నది అన్నమాట. సిలికాన్ వాలీ పెద్దలు ముందుగా సుప్రీంకోర్టు తలుపు తడతారన్నది నిజం. ఎందుకంటే మొదట నష్టపోయేది వాళ్లే. ఇక స్టూడెంట్ వీసా కోసం భారత్‌లోని బ్యాంకుల్లో అప్పు చేసి, అమెరికాలో చదువుకుంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటూ నెట్టుకొద్దామనే వాళ్లకి ఆశాభంగం తప్పదు. త్వరలో అమెరికన్ యూనివర్సిటీలో చదవాలి అంటే భారం కావచ్చు. అమెరికా, బ్రిటన్ దేశాలలోని యూనివర్సిటీలు ముస్లిం దేశాల నుంచి భారీగా విరాళాలు స్వీకరిస్తూ నెట్టుకొస్తున్నాయి. ఈ విరాళాలు తీసుకోకుండా అడ్డుకునే ప్రయత్నంలో ఉన్నాడు ట్రంప్. భారతీయ విద్యార్థులు అక్కడి ఖర్చులకు సరిపడా డబ్బు సమకూర్చుకొని వెళ్లాల్సి ఉంటుంది. ఒకసారి చదువు అయిపోయిన తర్వాత ఎవరికివారు వాళ్ల దేశాలకి వెళ్లిపోవాలి. ఉద్యోగ అవకాశం వస్తే మళ్లీ వీసా తీసుకొని అమెరికా వెళ్లాల్సి ఉంటుంది. అమెరికా అల్లుడు, కోట్ల రూపాయల కట్నాలకి తాత్కాలికంగా తెర పడుతుంది అనుకోవచ్చు. అదే సమయంలో గ్రీన్‌కార్డ్ ఉన్నవాళ్లకి భారీగా కట్నాలు ఇవాల్సి ఉంటుంది ఆడపిల్లల తల్లిదండ్రులకి. హెచ్1బి వీసా ఉన్న వాళ్లకి డిమాండ్ పడిపోతుంది. ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ని టాయిలెట్ పేపర్‌తో పోలుస్తున్నారు నిపుణులు. ముందు ఫెడరల్ కోర్టులు అంగీకారం తెలపాలి. అయితే రాజ్యాంగం సవరించకుండా ట్రంప్ ఆర్డర్ చెల్లదనే తీర్పు వస్తుంది మరో మూడేళ్లకి. కోర్టు తీర్పుని అనుసరించి రాజ్యాంగ సవరణ చేయాలని ట్రంప్ అనుకున్నా అది అంత సులభంగా జరిగేపని కాదు. ఎలాగంటే.. యునైటెడ్ స్టేట్స్ కాన్‌స్టిట్యూషన్ ఫోర్టీన్త్ అమెండ్‌మెంట్ ఆర్ పర్సన్స్ బోర్న్ ఆర్ నేచురలైజ్డ్ ఇన్ ద యునైటెడ్ స్టేట్స్, అండ్ ద స్టేట్ వేర్ దే రిసైడ్. ఇది అమెరికా 14వ రాజ్యాంగ సవరణలో ఉన్నది. పోనీ రాజ్యాంగ సవరణ చేద్దామని అనుకున్నా అదీ జరిగే పని కాదు. 291 మంది కాంగ్రెస్ సభ్యులు + 67 మంది సెనేటర్ల మద్దతు కావాలి. అంటే 68 మంది డెమోక్రాట్ హౌస్ సభ్యులు, 23 మంది డెమోక్రాట్ సెనేటర్ల మద్దతు కావాలి. ఇక 223 మంది రిపబ్లికన్ సభ్యులు హౌస్‌లో, 53 మంది రిపబ్లికన్ సెనేటర్స్ మద్దతు కూడా కావాలి. ఆఫ్కోర్స్ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ కూడా ఓటింగ్‌లో పాల్గొనాలి. పైన చెప్పినవి మొదటి మెట్టు. రెండవ మెట్టులో 2/3 మెజారిటీ ఉండాలి రాజ్యాంగ సవరణ చేయాలి అంటే. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 34 రాష్ట్రాలు ఒప్పుకోవాలి. వీటిలో 5 రాష్ట్రాలు డెమోక్రాట్స్ చేతిలో ఉన్నాయి. సాధ్యమా? ఎన్నికల హామీ నెరవేర్చాడు ట్రంప్ అంతే. బహుశా కేసీఆర్ స్ఫూర్తి ఇచ్చి ఉంటారు.. తెలంగాణ రాగానే రామోజీ ఫిల్మ్ సిటీని లక్ష నాగళ్లతో దున్నుతాను అని.. కానీ లక్ష నాగళ్లు లభ్యం కాలేదు. ట్రంప్ కూడా మాట ఇచ్చాను నెరవేర్చాను కానీ నాకు పూర్తి మెజారిటీ ఇవ్వలేదు కాబట్టి అది పూర్తిగా నెరవేర్చలేకపోయాను అంటాడు. ఎటూ కోర్టు తీర్పు వచ్చేసరికి నాలుగేళ్లు పడుతుంది. మళ్లీ ఎన్నికలు వస్తాయి. ప్రస్తుత వీసా ఆర్డర్ వల్ల ఎక్కువగా నష్టపోయేది భారత్ మాత్రమే. అయితే నాలుగేళ్లు ఇబ్బంది ఉండవచ్చు లేదా ట్రంప్ ఆర్డర్ అమలు కాకుండా కోర్టు స్టేఆర్డర్ ఇస్తే మూడు నెలల ఇబ్బంది ఉంటుంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినా మనమేమి సంబర పడనవసరం లేదు.

# సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గార, శ్రీకాకుళం రూరల్ మండల ప్రజల నుంచి వినతుల స్వీకరణ ప్రజా గ్రీవెన్స్ బుధవారం నిర్వహించారు. ప్రజాదర్బార్‌లో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల కోసం, గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి అధికంగా అర్జీలు వస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలన కారణంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్తు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా నోచుకోక పోవడంతో ప్రజలు దుర్భర పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒకే రోజులో వేలాదిగా గ్రామసభలు నిర్వహించి పల్లెల్లోని సమస్యలను గుర్తించామన్నారు. గామాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టి పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొనే దిశగా కొనసాగుతామన్నారు. ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి వేలాదిగా వినతులు వస్తుండడం చూస్తుంటే గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్య ధోరణి కి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు.



జెడ్పీ మాజీ చైర్మన్ స్వర్గీయ పాలవలస రాజశేఖరం కుటుంబ సభ్యులను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, ఆముదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జ్ సనపల అన్నాజీరావు బుధవారం పరామర్శించారు. ఈమేరకు ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతిని పరామర్శించారు. ఆయనతోపాటు ఆమదాలవలస మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవిందగోపాల్, లక్కినేని సాయిరాం పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, ఆమదాలవలస**

## రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

నియోజకవర్గంలో సరుబుజ్జిలి మదనపురం రోడ్ నుండి బొడ్లపాడు గ్రామానికి సుమారు రూ.కోటి వ్యయంతో మంజూరైన బీటీ రోడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, కూటమి నాయకులు, ఆర్&బి అధికారులు పాల్గొన్నారు.




## బీజేపీ జిల్లా అధ్యక్షునిగా సిరిపురపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఆ పార్టీ జిల్లా నూతన అధ్యక్షునిగా సిరిపురపు తేజేశ్వరరావు నియమితులయ్యారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో తేజేశ్వర రావును జిల్లా అధ్యక్షునిగా ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెయిల్ డైరెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కాశీ విశ్వనాథరాజు, ఎన్నికల పరిశీలకులు డాక్టర్ సుహాసిని ఆనంద్, జిల్లా ఎన్నికల అధికారి, పూడి తిరుపతి రావు, బిర్లంగి ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరుకండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 23, 24 తేదీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) శ్రీకాకుళంలో నాక్ పీయర్ టీం సందర్శన ఉన్నందున పూర్వ విద్యార్థులందరూ కళాశాలలో జరిగే పూర్వ విద్యార్థుల సమావేశానికి ఈనెల 23 మధ్యాహ్నం రెండు గంటలకి కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ పి.సురేఖ పేర్కొన్నారు. ఎక్కువమంది పూర్వ విద్యార్థులు హాజరై కళాశాలకు మంచి గ్రేడు పొందే విధంగా కృషి చేయాలని ప్రిన్సిపాల్‌తోపాటు పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు అంబటి రంగారావు, సెక్రటరీ వి.వి.ఆర్.ఎస్.మూర్తి ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రామకృష్ణలు కోరారు.

## వెంకటరాముని కోనేరుని సందర్శించిన సుడా చైర్మన్

(సత్యంన్యూస్, పాలకొండ)

పాలకొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకట రాముని కోనేరును సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ బుధవారం పరిశీలించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లతో ఆ కొనేరుని సందర్శించి దాని అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయమని ఆదేశించారు.



## జెడ్పీ స్కూల్‌లో ఘనంగా గిడుగు వర్ధంతి


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం గ్రామీణ మండలం పాత్రుని వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వండాన రామారావు అధ్యక్షతన గిడుగు వేంకట రామమూర్తి పంతులు 85వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలుగు భాషోపాధ్యాయులు దాష్టి సుధామణి, పిసిని వసంతరావులు మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి గిడుగు వెంకట రామమూర్తి ఎనలేని కృషి చేశారని, అటువంటి మహనీయుడును స్ఫూర్తిగా తీసుకొని తెలుగు భాషాభివృద్ధికి అందరము కృషి చేసిన నాడే అతనికి ఇచ్చిన సరైన నివాళి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# చైతూకు బన్నీ ఫ్యాన్స్ సపోర్ట్

నాగచైతన్య 'తండేల్' ఫెబ్రవరి 7న ప్రేక్షకులు ముందుకు వస్తోంది. మధ్యలో మరో రెండు వారాలే వుంది. ఈ పాటికి ప్రమోషన్స్ జోరు పెరగాల్సింది. కానీ ఇప్పటివరకూ ఓ రెండు పాటలే బయటికి వచ్చాయి. అయితే వెంటనే ప్రమోషన్స్‌లో జోరు పెంచమని కోరుతున్నారు ఫ్యాన్స్. ఇక్కడ విశేషం ఏమిటంటే.. ఇలా కోరుతున్నది చైతు ఫ్యాన్స్ కాదు.. బన్నీ ఫ్యాన్స్. 'తండేల్' సినిమా గీతా ఆర్ట్స్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అల్లు అరవింద్, బన్నీవాసు కలసి భారీ బడ్జెట్ తో తీశారు. ఇప్పటివరకూ చైతు కెరీర్ లో ఇదే హయ్యస్ట్ బడ్జెట్ సినిమా ఇదే. బన్నీ కాంపౌండ్ నుంచి వసున్న ఈ సినిమాపై అల్లు అర్జున్ ఆర్మీ దృష్టి పెట్టింది. అల్లు ఫ్యాన్స్ అకౌంట్స్ లో తండేల్ పోస్టులు కనిపిస్తున్నాయి. 'ప్రమోషన్స్ స్టార్ట్ చేయండి. బ్రేక్ ఇవ్వడానికి మేము సిద్ధం' అంటూ ఫ్యాన్స్ తమదైన శైలిలో ప్రకటిస్తున్నారు. 'పుష్ప రాజ్ కా బాప్.. తగ్గేదేలే' అంటూ తండేల్ ఫోటోలతో అల్లు అర్జున్‌ని ట్యాగ్ చేస్తున్నారు. **- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**



# కావాలనే బాత్‌రూం వీడియో లీక్..!

తెలుగు ప్రేక్షకుల ముందుకు మరోసారి 'డాకు మహారాజ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ దక్కించుకున్న ముద్దుగుమ్మ ఊర్వశి రౌతేలా. ఈ అమ్మడు బాలకృష్ణతో కలిసి వేసిన దబిడి దిబిడి స్టెప్స్ వివాదాస్పదం కావడంతో పాటు వైరల్ అయిన విషయం తెల్సిందే. డాకు మహారాజ్ సినిమాలో కేవలం పాటకే పరిమితం కాకుండా కీలక పాత్రలో నటించింది. ఒక యాక్షన్ సన్నివేశంలోనూ ఊర్వశి రౌతేలా మెప్పించింది. ప్రస్తుతం ఊర్వశి డాకు మహాజార్ హిట్‌ని ఎంజాయ్ చేస్తుంది. టాలీవుడ్‌లో తనకు భారీ విజయం దక్కిందని ఇటీవల ఒక బాలీవుడ్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ముందు ముందు మరిన్ని సినిమాలు చేయబోతున్నట్లు పేర్కొంది. ఆ ఇంటర్వ్యూలో తన లీక్ వీడియో గురించి స్పందించింది. గత ఏడాది ఊర్వశి రౌతేలా నటించిన 'ఘుస్పైతియే' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా విడుదలకు కొన్ని వారాల ముందు ఊర్వశి రౌతేలా యొక్క బాత్ రూం వీడియో లీక్ అయ్యింది. ఆ సినిమాలోని సన్నివేశం సోషల్ మీడియా ద్వారా లీక్ అయ్యింది. లీక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అంతే కాకుండా సినిమా గురించి ప్రముఖంగా చర్చ జరిగేలా చేసింది. ఊర్వశి బాత్ రూంలో డ్రెస్ విప్పుతున్న వీడియోపై తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో కొన్ని రోజుల తర్వాత ఆ వీడియోను ఊర్వశి తొలగించింది. ఆ వీడియోపై ఇన్ని నెలల తర్వాత ఊర్వశి రౌతేలా స్పందించింది. ఘుస్పైతియే సినిమా నిర్మాతలు విడుదలకు కొన్ని రోజుల ముందు నా దగ్గరకు వచ్చారు. సినిమా నిర్మాణం కోసం చాలా ఖర్చు చేశాం, మేము సినిమా కోసం మా ఆస్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. సినిమా జనాల్లోకి వెళ్లాలి అంటే మీరు ఆ వీడియోను లీక్ చేయాలి, తద్వారా సినిమాకు బజ్ క్రియేట్ అవుతుంది అని వేడుకున్నారు. దాంతో వారి పరిస్థితిని అర్థం చేసుకుని సినిమాలో భాగమే కనుక నేను ఆ సీన్‌ను లీక్ చేశాను అన్నట్లు ఊర్వశి రౌతేలా చెప్పుకొచ్చింది. ఆ వీడియోతో అమ్మాయిలకు మంచి మెసేజ్ ఇచ్చామని సైతం ఊర్వశి చెప్పుకొచ్చింది. అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఊర్వశి సూచించింది. గతంలోనూ నేను నటించిన సినిమాలో బాత్ రూం సన్నివేశం ఉంది. ఘుస్పైతియే సినిమాలో కొత్తగా చేసింది ఏమీ లేదు. అయితే సీన్ సోషల్ మీడియా ద్వారా లీక్ కావడం చర్చనీయాంశం అయ్యింది. నిర్మాతల శ్రేయస్సు కోసం తాను కొన్ని సార్లు సోషల్ మీడియా ద్వారా అలాంటి ప్రమోషన్స్ చేయాల్సి ఉంటుందని చెప్పుకొచ్చింది. ఘుస్పైతియే సినిమా అంటే తనకు ప్రత్యేకంగా ఇష్టం అని, అందుకే తాను ఆ సినిమా ప్రమోషన్స్ కోసం లీక్ వీడియోతో తనవంతు సహకారం అందించినట్లుగా ఇంటర్వ్యూలో ఊర్వశి రౌతేలా చెప్పుకొచ్చింది. డాకు మహారాజ్ సినిమా తర్వాత టాలీవుడ్‌లో ఊర్వశి మరిన్ని సినిమా ఛాన్స్‌లు దక్కించుకునే అవకాశం ఉంది.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**





# మరో సౌందర్య అవుతుందా?

**ఐశ్వర్యా రాజేష్ తెలుగులో నటించింది నాలుగైదు సినిమాలే. తెలుగు నటి అయినా ఇక్కడ పెద్దగా ప్రోత్సాహం లభించక పోవడంతో కోలీవుడ్ లో సక్సెస్ అయింది. అక్కడ నుంచి తెలుగు సినిమాలకు ప్రమోట్ అయింది. 'కౌసల్య కృష్ణ మూర్తి', 'మిస్ మ్యాచ్', 'వరల్డ్ ఫేమస్ లవర్', 'టక్ జగదీష్', 'రిపబ్లిక్' లాంటి చిత్రాల్లో నటించింది. కానీ వీటిలో ఏ సినిమా అంతగా ఫేమస్ చేయలేదు. అయితే ఇటీవల రిలీజ్ అయిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో మాత్రం తెలుగు ఆడియన్స్‌కి బాగా కనెక్ట్ అయింది.**

విక్టరీ వెంకటేష్ భార్య పాత్రలో ఐశ్వర్య నటన, ఆహార్యంతో ఆకట్టుకుంటుంది. ఈ సినిమాతో నటిగా ఓ మెట్టు పైకి ఎక్కింది. అచ్చమైన తెలుగింట ఆడపడుచునే చూపించింది. ఈ సినిమా ఐశ్వర్య కెరీర్ లో గొప్ప చిత్రంగా నిలిచి పోతుందనొచ్చు. ఇంతకాలం తెలుగు నుంచి సరైన నటి లేదు? అనే ఉన్నవాళ్లకు అవకాశాలు రాలేదు అన్న బాధ చాలామందిలో కనిపించేది. కానీ ఐశ్వర్య సంక్రాంతికి వస్తున్నాం లో నటించిన తీరుతో చాలా కాలానికి ఓ గొప్పనేచురల్ పెర్ఫార్మర్ దొరికిందనే ప్రశంస అందుకుంటుంది.

అంజలి అలియాస్ సీతమ్మ ఉన్నా? ఆమెకి సరైన పాత్రలు పడకపోవడంతో ప్రూవ్ చేసుకోలేకపోయింది. కానీ ఐశ్వర్య మాత్రం తన నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించింది. ఈ నేపథ్యంలో ఐశ్వర్య పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తుంది. ఐశ్వర్య రాజేష్ ని తెలుగు అభిమాను సౌందర్య అంటూ కీర్తిస్తున్నారు. అప్పట్లో వెంకటేష్–సౌందర్య కాంబినేషన్ అంటే ఓ ప్రత్యేకమైన క్రేజ్ ఉండేది. వెండి తెరపై సూపర్ జోడీగా పేరు తెచ్చుకుంది.

ఆ కాంబోలో ఎన్నో విజయవంతమైన చిత్రాలొచ్చాయి. అలా వెంకీ–సౌందర్య కాంబినేషన్ అంటే మార్కెట్ లో బ్రాండ్ గా మారిపోయింది. ఆ తర్వాత వెంకటేష్ చాలా మంది హీరోయిన్లతో కలిసి నటించారు. ఏ కాంబోకి అంత గుర్తింపు రాలేదు. చాలా కాలానికి మళ్లీ ఐశ్వర్య రాజేష్ రూపంలో వెంకీకి పర్ఫెక్ట్ జోడీ అంటూ నీరాజనాలు అందు కుంటుంది. యూత్ ఫుల్ చిత్రాలు..ప్రేమికురాలు పాత్రలకంటే ఐశ్వర్యకు పిల్లల తల్లి పాత్రలు... భార్య పాత్రలు.. అక్కా..చెల్లి పాత్రలే పర్ఫెక్ట్ గా సూటవుతాయని నెటి జనులు అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమా సక్సస్‌తో అంజలి కంటే నటిగా ఒక్క అడుగు ముందులో ఐశ్వర్య కనిపిస్తుందంటున్నారు.



కొన్ని కథలు హార్ట్ టచింగ్‌గా ఉంటాయి. పాత కథే. కానీ, ఎప్పుడు విన్నా ఒకింత స్ఫూర్తి రగిలించే కథ. తమిళనాడు వాసైన వాషింగ్టన్ పోస్ట్ సీనియర్ జర్నలిస్టును నేలకు దింపిన కథ.. నిశ్చేష్టుణ్ణి చేసిన కథ. ఆ జర్నలిస్ట్ పేరు విశ్వనాథ్. ఈ కథను ఆయన మాటల్లోనే విందాం.

**తత్వబోధకై వెళ్లిన సీనియర్ జర్నలిస్టుకు.. పుస్తకం చదవక ముందే తత్వం బోధించిన గల్లీగర్ల్ కలైవాణి**

# వాషింగ్టన్ జర్నలిస్ట్‌కే తత్వం బోధించింది!

మేము ఓరోజు చెన్నై వెళ్లాం. అక్కడ మైలాపూర్ లోని కపాలీశ్వరర్ కోవెలలో దర్శనం చేసుకున్నాం. ఆ తర్వాత ఆధ్యాత్మిక పుస్తకాలు, సంగీత సీడీలు, క్యాసెట్స్ కు పేరెన్నికైన గిరి ట్రేడింగ్ స్టోర్‌కు వెళ్లాం. నేను, నా భార్య ఇద్దరం ఎవరికి కావల్సినవి వాళ్లం వెతుకుతున్నాం. మాలాగే చాలామంది అరుణా సాయిరామ్ భజనల నుంచి మొదలుకుంటే బాంబే జయశ్రీ శాస్త్రీయ సంగీత సీడీల వరకూ వెతికే విభిన్న అభిరుచుల సంగమం అక్కడ కనిపించింది. నా భార్య ఎం.ఎస్.సుబ్బులక్ష్మి భక్తి, శాస్త్రీయ సంగీతం, భారతీయార్ గీతాల సీడీల కోసం వెతుకుతోంది. ఇక నేనేమో తత్వబోధ అనే పుస్తకం కోసం వెతుకుతున్నాను. ఆ పుస్తకాల షాపులో క్యాషియర్‌కు అవతలివైపు నుంచి సరిగ్గా పదిహేడు, పద్దెనిమిదేళ్లుంటాయేమో బహుశా.. ఎనిమిదవ తరగతి చదువుతుండొచ్చు.. ఓ నల్లపిల్ల మావైపే చూస్తోంది. ఆ అమ్మాయి తదేకంగా చూస్తుండటంతో.. ఉన్నవీ, లేనివి అన్నీ ఊహించే నా జర్నలిస్ట్ బుర్రకు ఏదైనా చుట్టుపక్కల గ్రామానికి చెందిన అమ్మాయేమో.. పేదరికంతో ఇక్కడికి పనిచేయడానికొచ్చినట్టనిపించింది. కానీ, ఆ అమ్మాయి మాత్రం ఓవైపు తన పని చేసుకుంటూనే.. తిరిగి తిరిగి నావైపు చూస్తోంది. నా చూపూ ఆ అమ్మాయి వైపు పడుతున్నా పోనీలే అనుకుని నా తత్వబోధ కోసం నా వెతుకులాట సాగుతోంది. సంధ్యావందనం నుంచి స్వామి వివేకానంద షికాగో పర్యటన వరకూ అన్ని పుస్తకాలూ కనిపిస్తున్నాయే తప్ప సుమారు 40 నిమిషాల నుంచి వెతుకుతుంటే తత్వబోధ మాత్రం లభించలేదు. మళ్లీ ఆ అమ్మాయి నాకేసి చూసింది. నేనూ చూశాను. సార్ నేనేమైనా మీకు సాయపడగలనా అనడిగింది ఆ అమ్మాయి. ఆ అమ్మాయికేం తెలిసుంటుందిలే పోనీ.. ఇక తత్వబోధ దొరకదేమోనన్న ఉద్దేశంతో అమ్మా నీకు దొరక్కపోవచ్చు.. తత్వబోధ అనే పుస్తకం కోసం నేను వెతుకుతున్నాను వదిలేయ్ అన్నాన్నేను. అయితే, నేను మీకు సాయం చేస్తానంది. ఏస్, నాకు తత్వబోధ కావాలి, దొరుకుతుందా, నీకు తెలుసానని నేనడిగాను. సంస్కృత పుస్తకమా.. లేక, ఇంగ్లీష్ వెర్షనా అనడిగింది ఆ అమ్మాయి. అప్పటివరకూ విర్రవీగిన మనస్తత్వంతో ఉన్న నేను.. అప్పటికి కాస్త రియలైజై.. ఓ ఈమెకు సంస్కృతం, ఇంగ్లీషూ కూడా తెలుసా..? అనుకున్నాను. చిన్మయా మిషన్ పబ్లికేషన్, ఇందు పబ్లికేషన్.. లేదా, రామకృష్ణమఠ్ పబ్లికేషన్ ఏది కావాలనడిగింది..? నేనింకా వందరయ్యాను! అప్పటివరకూ తత్వబోధ పుస్తకం గురించి మాత్రమే తెలుసుగానీ.. అన్ని పబ్లికేషన్స్, అన్ని భాషల్లో ఉన్న విషయాలు, ఆ విషయాలన్నీ ఆమెకు తెలుసునన్న విషయాలు ఇలా ఒకదాని తర్వాత ఒకటి నన్ను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నాయి. అప్పటివరకూ ఆమెపైనున్న నా అంచనాలన్నీ ఒక్కొక్కటిగా పటాపంచలైపోతున్నాయి. అసలు నాకేం తెలియదు.. మీరే చూడండి.. నిజంగానే, నాకు పుస్తకం చదవాలనుకున్నానేగానీ.. అంత లోతుగా తెలియదని నేనే ఆ అమ్మాయికి తిరిగి చెప్పాను. దాంతో మీరు తమిళం చదవగలరా సార్ అనడిగింది మళ్లీ..? ఏస్ అన్నాన్నేను. అయితే, మీరు ఇది తీసుకోండంటూ నేను ఏ బుక్ షెల్ఫ్లోనైతే 30 నిమిషాల పాటు తత్వబోధ కోసం వెతికానో.. అక్కడే మొదటివరుసలో ఉన్న తత్వబోధ బుక్ తీసుకుని నా దగ్గరకు వచ్చింది ఆ అమ్మాయి. అంతేకాదు.. ఏన్. శివరామన్ అనే తమిళ రచయిత తమిళంలో చాలా సరళంగా, సులువుగా అర్థమయ్యేలా రచించిన ఇందు పబ్లికేషన్స్ వారి ప్రచురణలో వచ్చిన పుస్తకమిది. మీకు కావాలంటే ఇందులోనే సంస్కృతం కూడా ఉంది. సో, ఇది మల్టీలాంగ్వేజెస్ తో విడుదలైన పుస్తకమని నా చేతికందించింది. జస్ట్ నేను షాకయ్యాను. ఇంత జీనియస్ అమ్మాయినా నేను అండర్ ఎస్టిమేట్ చేసింది. అప్పుడు ఆమెను మేడం అని సంబోధిస్తూ నాకు అసలు తత్వబోధ అనే పుస్తకం గురించి ఏమాత్రం తెలియదు. ఓ లెక్చర్ విన్నప్పుడు ఈ పుస్తకం పట్ల ఆకర్షితుణ్నై ఇక్కడ దొరుకుతుందంటే వచ్చి వెతుకుతున్నానని.. అప్పటివరకూ నాలో నేను విర్రవీగిన నేనే ఆమెతో బోల్డ్‌గా ఉన్నదున్నట్టు చెప్పాను. మీరు భారతీయ విద్యాభవన్‌లో గోదా వెంకటేశ్వరస్వామి బోధనలు విన్నారా అనడిగింది ఆ అమ్మాయి. మళ్లీ నేను షాక్! మీకెలా తెలుసు? ఆయన ఇలాంటి లెక్చర్స్‌లో చెన్నై నగరంలోనే ది బెస్ట్. ఇలాంటి క్లాసెస్ ఆయన క్రమం తప్పకుండా నిర్వహిస్తుంటారని చెప్పిందా ఆ అమ్మాయి. మీకింలాంటి విషయాల పట్ల ఆసక్తి ఉందా అనడిగాన్నేను. అవును సార్, నేను స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, అలాగే, మీరు చదువాలనుకుంటున్న తత్వబోధ ఇవన్నీ చదివానని.. తత్వబోధ తనకెంతో ఇష్టమనీ చెప్పిందా ఆ అమ్మాయి. నేను మళ్లీ షాక్.. ఏంది నువ్వు తత్వబోధ చదివావా..? అవును, శివరామన్ గారు రాసిన, నేను మీకు షెల్ఫ్ లోంచి తీసిచ్చిన ఆ పుస్తకం చదివితే మీ టేబుల్ పై ఆ పుస్తకం ఎప్పుడూ అలా ఉండిపోవాల్సిందేనంది ఆ అమ్మాయి. అవునా, ఎందుకంత ప్రత్యేకత ఈ పుస్తకానికి అని మళ్లీ నాలో జర్నలిస్ట్ పైకొచ్చి ప్రశ్నించాడు. తనకు కావల్సిన సీడీల కలెక్షన్స్ అన్నీ పూర్తి చేసుకుని ఓ మూల నుంచి నా భార్య మా ఇద్దరి సంభాషణా వింటోంది.. ఇక్కడ జరుగుతోందంతా తదేకంగా చూస్తోంది.

ఆ అమ్మాయేం చెప్పిందంటే సార్ మీరొకసారి ఈ పుస్తకం చదివితే వేదాంత సారమంతా ఒక్కచోటే దొరుకుతుంది.. మనలో ఉన్న అహంకారం పటాపంచలైపోతుంది. నిజమా.. ఈ పుస్తకం అంత ప్రభావవంతమైందా అని నేనడిగాను.

అప్పుడు నా భార్య కూడా మా ఇద్దరి దగ్గరకు వచ్చింది. నేను నా భార్యకు ఆ అమ్మాయిని ఈమె చాలా ప్రతిభావంతురాలని పరిచయం చేశాను. వెంటనే నా భార్య ఈ అమ్మాయిని వాషింగ్టన్ పోస్ట్ కోసం నువ్వు ఎందుకు ఇంటర్వ్యూ చేయకూడదని ప్రశ్నించింది.. అవును కదా అనిపించి.. నేను ఆ అమ్మాయిని అడిగాను నీ ఇంటర్వ్యూ కావాలని. కానీ, ఆమె తిరస్కరించింది. మా బాస్ అనుమతి లేకుండా నేను అలా ఇంటర్వ్యూ ఇవ్వలేను. మీలాగే ఇప్పటికే చాలామంది వారికి కావల్సినవి దొరక్క వెతుకుతున్నారు. నేను వెళ్తానంటూ సెలవు తీసుకుంది. మీ పేరేంటని అడిగాను.. కలైవాణి అంటూ వెళ్లిపోయింది.

నా భార్య, నేను ఒకరి ముఖం ఒకరం చూసుకున్నాం. ఏదో తెలీని ఆనందం.. అందులోనే అహంకారంతో వేసిన అజ్ఞానపు అంచనా తాలూకు ఆందోళన. కలైవాణి నాకంటే, నా భార్యను ఇంకా ఇంప్రెస్ చేసింది. ఆమె నేరుగా గిరి ట్రేడింగ్ స్టోర్ యజమాని దగ్గరకు వెళ్లింది. సార్ ఆమె పేరు కలైవాణా అని అడిగింది. అవును, చాలా కష్టపడి పనిచేస్తుంది ఆ అమ్మాయన్నాడు ఆ స్టోర్స్ యజమాని. ఆ తర్వాత నా భార్య నన్ను పరిచయం చేసింది. ఈయన నా భర్త. వాషింగ్టన్ పోస్ట్ లో సీనియర్ జర్నలిస్ట్.. పేరు విశ్వనాథ్ అంటూ. వావ్ వాషింగ్టన్ పోస్ట్‌లోనా.. గ్రేట్ సార్ అంటూ ఆ యజమాని లేచి నిలబడ్డారు. నేను ఆ అమ్మాయిని ఇంటర్వ్యూ చేయాలనుకుంటున్నానని చెప్పాను. బాస్ ఆమెను పిల్చాడు. కలైవాణీ.. వీరు యూఎస్ నుంచి వచ్చారు.. మీతో ఏదో ఇంటర్వ్యూ చేయాలనుకుంటున్నారు.. కాస్సేపు నీతో సమయం కావాలంటున్నారు.. నీకు సమ్మతమేనా అడిగారు బాస్. సార్ ఇప్పటికే చాలామంది కస్టమర్స్ ఉన్నారు. వాళ్లకు కావల్సినవి దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇవాళ స్టోర్స్ బాగా బిజీగా ఉంది. వీలైతే సార్ వాళ్లు రేపు రాగలిగితే బాగుంటుందేమోనన్నట్టుగా కలైవాణి పూర్తిగా కాదనీ, అవుననీ చెప్పకుండా జవాబిచ్చింది. అప్పుడు కలైవాణి మాకింకా నచ్చింది. దాంతో సరే మేం రేపే వస్తామని చెప్పాం. అప్పటికే తెల్లవారి నాకు టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఓ ఇంటర్వ్యూ ఉండె. కానీ, కలైవాణి కోసం దాన్ని వదులుకున్నాను. తెల్లవారి కలైవాణిని కలిసి ఇంటర్వ్యూ చేశాను. కలైవాణి చెన్నై సమీపంలోని ఆర్కాట్ అనే గ్రామానికి చెందిన అమ్మాయి. ఆమెకు ఐదుగురు చెల్లెళ్లున్నారు. తండ్రి తాగుబోతు. ఆ మద్యమే తండ్రి ప్రాణాలు తీసింది. ఆమె తల్లి తాపీపనిలో సహాయకురాలిగా కూలీ చేస్తుండేది. కానీ, అప్పటికే రెండేళ్ల క్రితం తల్లి కూడా మరణించింది. మొత్తంగా కలైవాణితో పాటు.. ఆరుగురు ఆడబిడ్డలు అమ్మానాన్నలను కోల్పోయి వీధిలో పడ్డారు. 9వ తరగతి చదువుతున్న కలైవాణి ఉద్యోగం కోసం వెతుకుతుంటే.. ఆమె లైఫ్ స్టోరీ విని గిరి ట్రేడింగ్ సెంటర్ యజమాని ఆమెకు సాయం చేశాడు. తన స్టోర్స్‌లో ఉద్యోగమిచ్చాడు. తనకు స్టోర్స్‌లో వచ్చే జీతంతోనే మిగిలిన ఐదుగురు చెల్లెళ్లను చదివించింది. చెన్నై కార్పోరేషన్ పాఠశాలలో వారంతా చదివారు. కలైవాణీ..నీకు తత్వబోధ గురించి తెలుసుకోవాలని ఎందుకనిపించిందని నేనడిగాను. దానికి ఆమె ఏం చెప్పిందంటే.. సార్ ఇక్కడ చేరాక వినియోగదారులకు ఏది అవసరమో దాని గురించి కొంత తెలుసుకోవడం వల్ల మనం మొదట బాగా పని చేయొచ్చు. రోజూ ఇదే స్టోర్‌లో పనిచేస్తున్న క్రమంలో అప్పుడప్పుడూ ఖాళీగా ఉన్నప్పుడు స్వామి వివేకానంద పుస్తకాలు తీసుకుని చదవడం ప్రారంభించాను. నన్ను ఆ పుస్తకాలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత భగవద్గీత, వివేకా చూడామణి వంటి పుస్తకాలపై నా మనసు పడింది. అలా పుస్తకాలు చదవడం ఇక నాకు ఓ అలవాటుగా మారింది. మీ జీతమెంత ఇక్కడ?..2500 రూపాయలు సార్.. ఇంత మొత్తం మీ ఐదుగులు చెల్లెళ్ల పోషణకు సరిపోతయా మరి..? అసలే సరిపోవు. కానీ, మా బాస్ నాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ కాదనకుండా సాయం చేస్తుంటారు. జీవితంలో మీ లక్ష్యమేంటి..? నా చెల్లెళ్లంతా బాగా చదువుకోవాలన్నదే నా లక్ష్యం సార్. అప్పుడైతే వారందరికీ మంచి ఉద్యోగాలు లభిస్తాయని ఆ ఆశ. మీ ఖర్చులన్నింటికీ నేను నెలకొక పది వేల రూపాయలిస్తాను.. సరిపోతుందా..? అసలు అంత మొత్తం మాకు చాలా ఎక్కువ. కానీ, మా బాస్ ఓకే అంటేనే నేను అంగీకరిస్తాను సార్. అప్పుడు మేం కలైవాణి బాస్ వద్దకు ఆమెను తీసుకెళ్లి, తన చెల్లెళ్ల చదువుల కోసం తాము ప్రతీ నెలా పదివేల రూపాయలు పంపాలనుకుంటున్నట్టు చెప్పాం. దానికి ఆమె పూర్తి అర్హురాలు. మీరు నన్ను నమ్మి నాకు పంపినా సరే.. లేదంటే నేరుగా ఆమె పేరిట బ్యాంక్ ఖాతా తెరిచి పంపినా సరేనన్నాడు కలైవాణి బాస్. అప్పుడు నా వెంట టైమ్స్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్, నా స్నేహితుడు జాన్ పాల్ కూడా నాతో ఉన్నాడు. ఆయనా చాలా సంతోషపడ్డారు. నువ్వు చాలా మంచి పని చేస్తున్నావంటూ నన్ను ప్రోత్సహించారు. కలైవాణిని కలిశాక మాలో ఆశ్చర్యంతో పాటు, సందేహాలు, ప్రశ్నల పరంపర మొదలైంది. భారతదేశంలో అట్టడుగు స్థాయిలోకి వెళ్లితే కలైవాణి వంటి జాతిరత్నాలింకెన్ని ఉన్నాయి కదా అని అనిపించింది. ఆ కర్పగంబల్ కృపతో కలైవాణి వేదాంతంలో నిపుణురాలై అమెరికాలో ఉపన్యాసాలిచ్చే స్థాయికి రావాలని తాను ప్రార్థిస్తున్నానంది నా భార్య. అందుకు మనం ఏర్పాట్లు చేద్దామని అప్పుడే నా భార్య నాతో చెప్పింది. కలైవాణి అంటే కళలవాణి. అలా వాణీ దేవి పేరుకు సార్థకత చేకూర్చిన మట్టిలో మాణిక్యం చెన్నై కలైవాణి. కలైవాణి నిజంగానే నాలో ఒక మార్పుకు కారణమైందంటారు విశ్వనాథ్.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## ప్రైమరీ మోడల్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయండి

(సత్యంన్యూస్, రణస్థలం)

పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు అంశాన్ని విద్యాశాఖామంత్రి లోకేష్ దృష్టికి తీసుకొని వెళ్లాలని ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావును కోరారు. ఈమేరకు నియోజకవర్గ పరిధిలో గల నాలుగు మండలాల విద్యాశాఖాధికారులు ఎన్ఈఆర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. విద్యాశాఖలో సమూల మార్పులే లక్ష్యంగా కృషి చేస్తున్న మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లాలని సూచించారు. జీవో 117పై ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గారు ఇచ్చిన రెప్రజెంటేషన్‌పై స్పందించి జీవో రద్దు చేయాలని నిర్ణయంపై స్వాగతిస్తున్నామన్నారు.





## చిట్టి వెంకటరావుకు పి.ఎం.జె బాబు పరామర్శ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు, ప్రముఖ దర్శకుడు చిట్టి వెంకటరావు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని తోటపాలెంలోని ఆయన స్వగృహంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.ఎం.జె.బాబు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఐటీడీపి జిల్లా అధ్యక్షులు ప్రధాన విజయరాం ఉన్నారు.

## మూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కామ్రేడ్ వీజీకే మూర్తి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎచ్చెర్ల మండల కేంద్రంలో కామ్రేడ్ వీజీకే మూర్తి సంతాపసభ జరిగింది. ఈ సభలో మాట్లాడుతూ కామ్రేడ్ వీజీకే మూర్తి సిఐటియు తొలితరము నాయకులని సిఐటియు జిల్లా ప్రధమ అధ్యక్షులుగా అనేక ఉద్యమాలు చేశారని కొనియాడారు. తన యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన ఒక గొప్ప యోధుడని కొనియాడారు. 1979లో ఉద్యోగ, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులుగా అనేక ఆందోళన పోరాటాలు నిర్మించారని, తుదిశ్వాస విడిచే వరకు ప్రజల కోసం పనిచేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. గరిమెళ్ళ విజ్ఞానకేంద్రం కార్యదర్శిగా సాంస్కృతిరంగంలో విశేషమైన కృషి చేశారన్నారు. ఈనెల 25న వీజీకే మూర్తి సంతాప సభ శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎల్.రామప్పుడు, చిక్కాల సత్యనారాయణ, ఎం.రమణ, సురేష్, సత్యనారాయణ పార్థసారథి తదితరులు ప్రసంగించారు.



## గిరిజన వర్సిటీకి గిడుగు పేరు పెట్టాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్రలోని విజయనగరంలో గల కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి గిడుగు రామమూర్తి పేరు పెట్టాలని స్థానిక శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక(తెరవే) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. బుధవారం ఇక్కడి కొత్తబ్రిడ్జి రోడ్డులో గల దత్తగుడి సమీపంలోని గిడుగు రామమూర్తి విగ్రహం వద్ద ఆయన 85వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అభినవ వాగనుశాసనునిగా, సవర భాషా సూరీడుగా ఎనలేని గుర్తింపు పొందిన గిడుగు రామమూర్తి పేరును గిరిజన వర్సిటీకి పేరు పెట్టాలని అఖిలభారత సవర భాషా సంఘం గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని తెరవే గుర్తు చేసింది. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్ధంతి కార్యక్రమంలో సభ్యులు, ఐ.యన్.డి. ప్రసాద్, భోగెల ఉమామహేశ్వరరావు, పూడి జనార్ధన్ రావు, వి.రాజారావు, డబ్బీరు గోవిందరావు పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని గిడుగుకు నివాళులర్పించారు.



## ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ఆకస్మిక తనిఖీ

(సత్యంన్యూస్, రణస్థలం)



మండలంలోని పాతర్లపల్లి హైస్కూల్‌ను బుధవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలనివిద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

# గెడ్డ అంతా ప్లాస్టిక్‌మయం



- ✔ 2,200 ఎకరాలకు ఇదే ఆదరువు
- ✔ పూడిక తీయకుండా గాలికి వదిలేసిన వైనం
- ✔ మేలుకోకుంటే ముప్పు తప్పదు

(సత్యంన్యూస్, కొత్తూరు)

గెడ్డ అంతా ప్లాస్టిక్ మయంగా మారింది. కొత్తూరు మండల కేంద్రంలో ప్రధాన నీటి హద్దుబంగి గెడ్డ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఈ అడ్డుబంగి గెడ్డపై దాదాపు 2,200 ఎకరాలు పైచిలుకు వ్యవసాయ భూమికి ప్రధాన ఆదరువు. ఈ ప్లాస్టిక్ మూలంగా రైతుల వ్యవసాయ భూములు, చెరువుల్లో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ చేరి పర్యావరణ పరిరక్షణకు ఇబ్బందిగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నీటి సంఘం ఎన్నికలు లేకపోవడంతో అధికారులు దీన్ని పూడిక తీయకుండా గాలికి వదిలేశారు. ఈ ప్రభుత్వంలో నీటి సంఘం ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించాలంటున్నారు.






## మీరు బయటకు రావాలా!..
# బ్రోకరాఫీసును సంప్రదించండి

(మొదటిపేజీ తరువాయి)

స్వయంగా కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులే గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఒక్కరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. న్యూకాలనీలో మూడు కార్పొరేట్ కాలేజీలు, రెండు కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. ఇవి కాకుండా రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నవారికి కొదవే లేదు. వాస్తవానికి ట్రాన్స్‌పోర్టు మొత్తం ఊరి శివారులో ఉండాలి. ఏ జిల్లాలో చూసుకున్నా ఇదే అమలవుతుంది. అయితే పెద్దపాడు, లేదా బలగ వైపు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, వాహనాలు తరలిపోవాల్సి ఉన్నా పోలీసులు, కార్పొరేషన్ యంత్రాంగం మాత్రం ఆ దిశగా ఆలోచించడంలేదు. నగరం నడిబొడ్డులో ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు ఎంత ప్రమాదకరమో వీరికి అర్థం కావడంలేదు. పెద్ద ఎత్తున రవాణా జరుగుతుందని చెప్పలేం కానీ కొన్ని ట్రాన్స్‌పోర్టు వాహనాల నుంచి కొద్దికొద్దిగా గంజాయి శ్రీకాకుళం దిగుమతి కావడమో, ఎగుమతి కావడమో జరుగుతుందన్న ఆరోపణలు మాత్రం ఉన్నాయి. అతి పెద్ద వాహనంలో అనేక వస్తువుల మధ్య ఒక వంద గ్రాముల గంజాయిని తేవడం పెద్ద విషయమేమీ కాదు. ఇటువంటి ట్రాన్స్‌పోర్ట్ వాహనాల మీద సాధారణంగా జీఎస్టీ అధికారుల దృష్టి మాత్రమే ఉంటుంది. పోలీసులు పట్టించుకోరు. ప్రస్తుతం న్యూకాలనీలో గంజాయి విరివిగా దొరుకుతుందంటే కారణం లారీల రాకపోకలేనన్న ఆరోపణలూ ఉన్నాయి. గంజాయి తాగి, మందు కొట్టి ఇక్కడ రాత్రిపూట కాలనీవాసులు బయటకు రాకుండా రౌడీమూకలు హల్‌చల్ చేస్తున్నాయి. 'సత్యం'లో ప్రచురించిన నిన్నటి కథనంలో పేర్కొన్న ప్రాంతం వద్ద చిమ్మచీకటిగా ఉందంటూ అనేకమార్లు ఫిర్యాదు చేయడం, కార్పొరేషన్ యంత్రాంగం వచ్చి వీధిదీపం వేయడం, ఆ రాత్రే గంజాయి మూకలు దాన్ని రాళ్లు విసిరి పగలగొట్టడం వల్ల ఫిర్యాదు చేయడాన్నే ఏకంగా మానుకున్నారు. కుటుంబానికి అద్దెకిచ్చేకంటే కమర్షియల్ వినియోగానికి అద్దెకివ్వడం వల్ల, అందులోనూ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు ఎక్కువ మొత్తం చెల్లిస్తున్నందున ఇక్కడ భవన యజమానులు గొడౌన్లకు, ట్రాన్స్‌పోర్టు కంపెనీలకు అద్దెకిచ్చేస్తున్నారు. ప్రస్తుతం న్యూకాలనీలో సిమెంట్, టైల్స్, శానిటరీ వేర్ గొడౌన్లు 10 వరకు ఉండగా, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నిచర్ గొడౌన్లు మరో 10 వరకు ఉన్నాయి. వీటిని దించడానికో, ఎత్తడానికో కొన్ని వాహనాలు, రెగ్యులర్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల నుంచి మరికొన్ని వాహనాలతో న్యూకాలనీ పూర్తిగా ఆటోనగర్‌గా మారిపోయింది. ఆటోనగర్‌లు ఎప్పుడూ ఊరిశివారులో ఉంటాయి. ఆ తర్వాత ఊరు విస్తరించొచ్చు. కానీ విస్తరించిన ఊర్లో మాత్రం మధ్యలో ఉండవు.

గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్‌కు ఎన్నికలు జరుగుతాయని భావించడం వల్ల ఇక్కడి నుంచి పోటీ చేయాలనుకున్న వైకాపా నాయకుడు ఆక్రమణలకు బార్లా గేట్లు తెరిచేశారు. దీంతో అనేక బడ్డీలు, వెల్డింగ్ షాపులు, మెకానిక్ షాపులు రోడ్డు మీదే వ్యాపారాలు చేసుకుంటున్నారు. న్యూకాలనీకి రోడ్డు వేయాలన్నా, లైటు వేయాలన్నా తనకు చెప్పే జరగాలని మున్సిపాలిటీని తన గుప్పెట్లో పెట్టుకున్న ఈ నాయకుడి ఓటు బ్యాంకు రాజకీయం వల్ల న్యూకాలనీ పూర్తిగా గాడితప్పింది.

### గడ్డర్ల ఏర్పాటుకు అనుమతివ్వండి

న్యూకాలనీలోకి భారీ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు రాకుండా అడ్డుకోవాలని, వీటిని ఊరి శివార్లలోకి తరలించాలని కాలనీ సంక్షేమ సంఘం గతంలో గ్రీవెన్స్‌కు ఇచ్చిన వినతుల్లో పేర్కొంది. పరిష్కారం కాకపోవడంతో కోర్టు మెట్లెక్కింది. ఆ తర్వాత పరిస్థితి ఏమిటనేది తెలియదు గానీ, న్యూకాలనీలో మాత్రం ప్రధాన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, వాటికి అనుసంధానంగా నడుస్తున్న కార్గో వాహనాలు రోడ్ల మీదే కనిపిస్తున్నాయి. పోలీసుల ఉదాశీనత, రాజకీయ నాయకుల ఓటుబ్యాంకు వల్ల ఫలితం కనిపించడంలేదని భావిస్తున్న కాలనీవాసులు తమ సొంత ఖర్చుతో కాలనీకి వచ్చే మార్గాల్లో ఒక నిర్ధిష్ట స్థాయి ఎత్తులో గడ్డర్లు ఏర్పాటు చేసుకుంటామని, అందుకు కనీసం అనుమతులైనా ఇవ్వాలని ఎమ్మెల్యే గొండు శంకర్‌కు విన్నవించుకుంటున్నారు. సెల్ఫ్ ఆపరేటింగ్ విధానంలో కాలనీవాసుల అవసరాల కోసం గడ్డర్‌లో పైభాగాన్ని అడ్జస్ట్ చేసుకునే విధంగా సొంత ఖర్చులు పెట్టుకుంటామని, ఈమేరకు అనుమతులు ఇప్పించాలని కోరుతున్నారు.

# పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద వివరాలు వెల్లడించారు. ఒక ప్రైవేట్ కంపెనీలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్న రణస్థలం మండలం బంటుపల్లి గ్రామానికి చెందిన నారు ప్రసాద్ చిన్నారులతో ఆడుకుంటున్న బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు వెల్లడించారు. ఈ నెల 13న భోగి పండుగ సందర్భంగా గ్రామంలో ఇంటి ముందు స్నేహితులతో ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల చిన్నారిని పిలిచి బిస్కట్లు, చాక్లెట్లు ఇచ్చి సమీపంలో ఉన్న సచివాలయం మేడ మీదకు ప్రసాద్ తీసుకెళ్లాడని, అక్కడ చిన్నారిపై అత్యాచారం చేసినట్టు తెలిపారు. చిన్నారి కొద్ది రోజుల తర్వాత నొప్పితో బాధపడుతూ తన పిన్నికి విషయం చెప్పింది. చిన్నారి తల్లిదండ్రులకు ఆమె సమాచారం ఇవ్వడంతో ఈ నెల 20న రణస్థలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేయగా, డిఎస్పీ వివేకానంద కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 21న రణస్థలం మండలం కంబాలపేట సమీపంలోని ఆర్చి వద్ద ప్రసాద్‌ను ఎస్ఐ చిరంజీవి అరెస్ట్ చేశారు. పోక్సో చట్టం కింద వివిధ సెక్షన్లతో కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సమావేశంలో డీఎస్పీతోపాటు రణస్థలం ఎస్ఐ ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరానికి విశేష స్పందన

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణాలు కాపాడుకోవచ్చున్నారు. రక్త నిల్వలు లేకపోవడంతో ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, రక్తం దానం చేయడం ద్వారా మరో ప్రాణం కాపాడుతుందని చెప్పారు. ప్రతీ వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చున్నారు. దీంతో ఆరోగ్యంగా ఉంటారని, మరలా కొత్త రక్తం తయారవుతుందన్నారు. ప్రతీ ఏడాది టీడీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని చెప్పారు. రక్తదానం చేసినవారిని అభినందించారు.

# శివారు ఆయకట్టుకు నీరందించే చర్యలు



(మొదటిపేజీ తరువాయి)

ఏరియాకు సాగునీరు అందడంలేదు. సాగునీటి కాలువ ఆయకట్టుగా గుర్తించినా వర్షాధార భూములుగానే మిగిలిపోయాయి. సకాలంలో వర్షాలు కురిస్తే తప్ప ఆ కాలువ కింద ఉన్న 13 పంచాయతీల పరిధిలో పంటలు పండే పరిస్థితి లేదు. నారాయణపురం ఆనకట్టకు దిగువన ఆయకట్టు శివారు ప్రాంతం సుమారు 50 కిలోమీటర్లు దూరం ఉంది. దీని ద్వారా ఎచ్చెర్ల మండలంలోనీ ఫరీద్‌పేట, ఇబ్రహీంబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, కుశాలపురం, తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, కొంగారం, పొన్నాడ, బొంతలకోడూరు, ధర్మవరం, భగీరథపురం గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 8వేల ఎకరాలు పైబడిన సాగుభూములకు నీరందాలి. ఖరీఫ్‌లో అరకొర అందినా రబీలో సాగునీరు అందక రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా అపరాలు, కూరగాయులు, ఆకుకూరలు పండిస్తుంటారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు నారాయణపురం కుడి కాలువను రైతులతో కలిసి సందర్శించి గుర్రపుడెక్క తొలగిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ప్రత్యేక నిధులు విడుదల చేసి కొంతమేర గుర్రపు డెక్కను తొలగించారు. అయినా సమస్యకు పరిష్కారం కాలేదు. జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో నారాయణపురం కుడికాలువ ఆయకట్టుకు నీరందడంలేదని జెడ్పీటీసీ, ఎంపీపీలు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. కాలువలో గుర్రపుడెక్క సమస్యతో సతమతమవుతున్న రైతులంతా కలిసి శ్రమదానం చేసి తొలగించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. కాలువపై 60 షట్టర్లు ఉన్నాయి. ఇందులో కేవలం మూడు షట్టర్లు మాత్రమే పని చేస్తున్నాయి. మిగతా 57 షట్టర్లు ఎత్తడానికి, దించడానికి అవసరమైన సామగ్రి, లష్కర్లు లేరు. దీంతో షటర్లు ఎత్తి ఉండడం వల్ల నీరు వృథాగా పోతుంది. దీంతో కాలువలో నీరున్నా ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. దీంతో ఖరీఫ్‌లో శివారు ఆయకట్టు రైతులు నానా యాతన పడ్డారు. ఇటీవల సాగునీటి సంఘాలకు ప్రతినిధులు ఎన్నుకోవడంతో వారిపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రస్తుతం రబీలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరడంతో సాగునీటి వినియోగదారుల సంఘాల నారాయణపురం ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పంచిరెడ్డి కృష్ణారావు మంగళవారం రైతులతో కలిసి ఆయకట్టును పరిశీలించారు. అధికార యంత్రాంగం నారాయణపురం కుడి కాలువ స్థితిగతులను పరిశీలించారు. ఆనకట్టలోని ఇసుకమేటలను తొలగించడం వల్ల నీటి సామర్థ్యం పెరిగి సకాలంలో ఆయకట్టు శివారుకు ఖరీఫ్, రబీల్లో నీరందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆనకట్ట హెడ్ షట్టర్లు, కుడికాలువ పరిధిలోని మదుములు రిపేర్ చేయించి ప్రస్తుత రబీ పంటలకు, రాబోయే ఖరీఫ్‌కు తాగు, సాగునీరు అందజేయుడానికి అవకాశం ఉందన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడును కలిసి ఎచ్చెర్ల పరిధిలో కుడికాలువ శివారు ప్రాంతాలకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు తెలిపారు.

# కార్పొరేషన్ అంటే మెయిన్ రోడ్లేనా?



(మొదటిపేజీ తరువాయి)

జీటీ రోడ్డు, పాలకొండ రోడ్డు వంటి వాటి మీదే ఏ ప్రభుత్వమైనా ఏకపక్షంగా దృష్టి సారించడం వల్ల నగరంలో కమర్షియల్ ప్రాంతాలు విస్తరిండంలేదు. విశాఖపట్నంలో ఒకప్పుడు జగదాంబ సెంటర్ మాత్రమే వ్యాపారాలకు కేంద్ర బిందువుగా ఉండేది. ఆ తర్వాత ఆసిల్‌మెట్ట, ద్వారకానగర్‌లు విస్తరించాయి. దీనికి ఆనుకొని వీఐపీ రోడ్డు, రామాటాకీస్ రోడ్డు ఇలా ఒకటేమిటి, విశాఖ మొత్తం కమర్షియల్ జోన్ అయింది. దీనివల్ల అన్ని ప్రాంతాలూ సరిసమానంగా అభివృద్ధి చెందాయి. అంతెందుకు.. పాలకొల్లు వంటి మున్సిపాలిటీలో కూడా ప్రధాన రహదారిలో కంటే వీధుల్లోనే కమర్షియల్ కాంప్లెక్స్‌లు సక్సెస్ అయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం, భీమవరంలలో వ్యాపారాలన్నీ మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న వీధుల్లోనే జరుగుతున్నాయి. అంతెందుకు.. మన పక్కనే ఉన్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు లాంతర్లు, గంటస్థంభం, లేదా రైల్వేస్టేషన్ రోడ్డు మీదకే వ్యాపారాలుండేవి. ఇప్పుడు రింగ్‌రోడ్డును డెవలప్ చేసిన తర్వాత విజయనగరం మొత్తం వ్యాపారాలు విస్తరించాయి. ఐదేళ్ల క్రితం వరకు శ్రీకాకుళంలో పెట్టిన మదుపులో పావువంతు పెడితే విజయనగరంలో ఆస్తి వచ్చేది. ఇప్పుడు అదే విజయనగరంలో శ్రీకాకుళంలో సమానంగా భూమి ధరలు ఉన్నాయి. ఇప్పుడు పాలకొండ రోడ్డుకు పార్కింగ్ లేకపోవడం, అవకాశ మున్నా పాలకులు ఆ వైపు దృష్టి సారించక పోవడం నగరంలో చర్చనీయాంశమైంది. పార్కింగ్ కోసం భవన యజమానులే సెల్లార్‌లు ఏర్పాటు చేసుకోవాలని కొంతమంది మేధావులు సలహా లిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ సబ్జెక్ట్ తెలియకుండా మాట్లాడినవారే ఎక్కువ. సెల్లార్ కట్టుకోవాలంటే జీవో నెంబరు 119 ప్రకారం భవన నిర్మాణ ఏరియా 750 చదరపు మీటర్లు దాటాలి. అంటే చిన్న చిన్న కమర్షియల్ స్థలాల్లో సెల్లార్ కట్టుకుంటామన్నా కార్పొరేషన్ పర్మిషన్ ఇవ్వదన్నమాట. ఈ పిసరంత ఏరియాలో 30 శాతం పార్కింగ్ కోసంతో పాటు ఫ్రంట్, రియర్, సైడ్ సెడ్‌బ్యాక్స్ విడిచిపెడితే, ఇక మిగిలిన స్థలంలో కట్టుకోవాల్సింది ఒక్క గోడ మాత్రమే.

కళింగ రోడ్డుకు, జీటీ రోడ్డుకు మెయిన్ లింక్ అయిన టౌన్‌హాల్ రోడ్డు, చిన్నబరాటం వీధి రోడ్డు వెడల్పు చేయడం తప్ప నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు మరో మార్గం లేదు. కానీ ఇప్పటి వరకు ఏ పాలకులూ అటువైపు దృష్టి సారించలేదు. టౌన్‌హాల్ రోడ్డును వెడల్పు చేయాలని 2009-14 మధ్య ధర్మాన ప్రసాదరావు రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు చిన్నబజారు రోడ్డును వెడల్పు చేయడంలో భాగంగా మిగిలిన నిధులతో టౌన్‌హాల్ రోడ్డు పని పట్టాలని భావించారు. అక్కడ క్రైస్తవ స్మశానవాటిక, చర్చి పెద్దలతో చర్చించే లోపు ఎన్నికలు రావడం, ధర్మాన ఓడిపోవడంతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ సంక్లిష్టత పరిష్కరించడానికి వెనుకడుగు వేసింది. మళ్లీ 2019-24 మధ్య ఈ అంశం తెర మీదకు వచ్చినా కార్యరూపం దాల్చలేదు. కారణం.. అప్పటి నిధులు ఖర్చుయిపోవడం, కొత్తగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడమే. అయితే క్రైస్తవ పెద్దలను మాత్రం ఒప్పించగలిగారు. అదే సమయంలో టౌన్‌హాల్‌కు సంబంధించిన కొంత స్థలం పోతున్నా ఓకే చేయించారు కానీ పనులు జరగలేదు. ఇక చిన్నబరాటంవీధి రోడ్డును వెడల్పు చేయాలని ధర్మాన మదిలో ఆలోచన ఉన్నా మొదట్నుంచీ కళింగకోమట్లు తమకు వ్యతిరేకంగా ఉన్నారని, ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పు చేయడం వల్ల ఓటు కోల్పోతామన్న భయంలో ఆ జోలికి పోలేదు. వాస్తవానికి చిన్నబరాటం వీధిలో ఉన్న ఇళ్లన్నింటిలోతెక్కువ. వరండాలు పోయినా ఆస్తి విలువ పెరుగుతుందన్న భావన వీరిలో ఉంది. కాకపోతే ధర్మాన వెనుకే ఉన్న ఈ ప్రాంత నాయకుడు ఈ దిశగా నడిపించలేకపోయారు. ఇప్పుడు మళ్లీ అదే జీటీ రోడ్డు, పాలకొండ రోడ్డు, కళింగరోడ్డుకు రంగులద్దడం మినహా సిక్కోలు సందుల రూపు మాత్రం మార్చడంలేదు. కనీసం ఈ ప్రభుత్వమైనా కార్పొరేషన్ ఎన్నికలు జరిపే లోపు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మళ్లీ కార్పొరేటరంటూ ఒక నాయకుడు పుట్టుకొస్తే స్వార్థ ప్రయోజనాలు మొదలవుతాయని, అలా కాకుండా తమ రోడ్డు వెడల్పు చేయాలని ఏ ప్రాంతవాసులైనా ముందుకొస్తే ఆ రోడ్లను మెరుగుపర్చాలని కోరుతున్నారు.



**శ్రీకాకుళం నగరంలో 10 అడుగుల వెడల్పు రోడ్డు మాత్రమే ఉన్న వీధులు 80 శాతం పైన ఉన్నాయని ఇప్పటి పాలకులకు తెలుసా? పాలకొండ రోడ్డులో డివైడర్ వేయడం, అందులో మొక్కలు నాటడం తప్పకాదు. కానీ ఇప్పుడు ఫుట్‌పాత్‌ల పక్కనే వాహనాలు పార్క్ చేస్తే అడ్డుకునేదెవరు? సెంటర్ పార్కింగ్ పెడితే నాలుగు అడుగుల మేర రోడ్డు వెడల్పు తగ్గిపోతుందని బాధపడుతున్నవారు ఇప్పుడు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్, మధ్యలో డివైజర్, ఫుట్‌పాత్‌లు కలిపితే ఎంత వెడల్పు రోడ్డు మిగులుతుందో చెప్పగలరా? లేదూ రోడ్డును వెడల్పు చేస్తామని హామీ ఇవ్వగలరా? అదే ఇస్తే డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఆమదాలవలస వరకు రోడ్డు విస్తరణకు నిధులు వచ్చినా బలగ ప్రాంతవాసుల నుంచి ఎందుకు ఇంకా క్లియరెన్స్ తెచ్చుకోలేకపోతున్నారు.**



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.